క్లుప్తంగా

వర్షంతో పంటలకు ఊరట

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్లు వేసినప్పటి నుంచీ సరైన వర్షాలు లేకపోవడంతో చేలు నెర్రలు తీసి నోరెళ్లబెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురవడంతో పంటలు ఊపిరి పోసుకున్నాయని రైతులు ఉపశమనం చెందారు. ఏడీబీ రోడ్డులో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు వర్షం కారణంగా ఎక్కడికక్కడ నిలిచి పోయారు. ఈ వర్షం మండలంలోని పలు పంటలకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు. వరి, మినుము పంటలతో పాటు, పామాయిల్, పండ్ల తోటలు, కూరగాయల పంటలకు మేలు జరుగుతుందని అంటున్నారు.

సచివాలయ సిబ్బంది పాత్ర కీలకం



బూరుగుపూడిలో సచివాలయాన్ని సందర్శించిన ఆర్డీఓ కృష్ణనాయక్

కోరుకొండ (రాజానగరం): ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలను సకాలంలో, సక్రమంగా అందించడంలో గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది పాత్ర ఎంతో కీలకమైనదని రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలోని గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి, అక్కడ అందిస్తున్న వాట్సాప్ గవర్నెన్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఆర్‌సీసీ కార్డులు, వాటర్ టాక్స్ వంటి సేవలను వేగవంతంగా పూర్తి చేయాలని వీఆర్వోలకు సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై విస్తతంగా ప్రజలలో అవగాహన పెంచాలన్నారు.

పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన ఏఆర్ డీఎస్పీ



సీతానగరం పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏఆర్ డీఎస్పీ కిషోర్

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలోని పోలీస్ స్టేషన్‌ను ఏఆర్ (ఆర్మ్‌డ్ రిజర్వు) డీఎస్పీ టీవీఆర్‌కే కిషోర్ పరిశీలించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిశీలనకు వచ్చిన డీఎస్పీ భవనం స్థలం, భవన స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ భవనం 30 ఏళ్లకు చేరుతుందన్నారు. దీనిని హౌసింగ్ ఏఈ పరిశీలించి సర్టిఫై చేస్తే, దానిని తొలగించి నూతన భవనం నిర్మించాల్సి ఉంటుందన్నారు. ఈ భవనాన్ని 1998లో నిర్మించారని చెప్పారు. భవన నిర్మాణానికి అంచనాలను పరిశీలించినట్టు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఆయన వెంట కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎస్సై డి.రామ్‌కుమార్ ఉన్నారు.

సింగవరంలో పారిశుధ్యం పరిశీలన

సీతానగరం: మండలంలోని సింగవరంలో పారిశుధ్య పరిస్థితులను జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి పరిశీలించారు. గురువారం ఆమెతో పాటు, డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి గ్రామాన్ని పరిశీలించి, చెత్తను చెత్త సంపద కేంద్రానికి తరలిస్తున్నారా, లేదా అని ఆరా తీశారు. స్థానికులను శానిటేషన్ స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఐవీఆర్ఎస్ కాల్స్‌పై పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్ వన్ టు సిక్స్ వారికి శానిటేషన్, ఇతర అంశాలపై సమావేశం నిర్వహించారు.

చవితి వేడుకలపై సమావేశం

బిక్కవోలు: ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని రంగాపురం గ్రామంలో రామాలయం సెంటర్ వద్ద సమావేశం నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు, అశ్లీల ప్రోగాంలు పెట్టకుండా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు.

బాబాకు క్షీరాభిషేకం

బిక్కవోలు: బలభద్రపురం ఆంధ్రా షిర్డీసాయి మందిరంలో సాయిబాబాకు గురువారం పెద్ద ఎత్తున క్షీరాభిషేకం నిర్వహించారు. శ్రావణ మాసం గురువారం పురస్కరించుకుని భక్తులు భారీగా అభిషేకాలు చేశారు. తులాభారాలు భారీగా జరిగాయని మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమ రెడ్డి తెలిపారు. భక్తులకు అన్న సమారాధన చేశారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

రంగంపేట: సింగంపల్లి, ఈలకొలను గ్రామాల్లో గురువారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఆయా దాడులలో సారా విక్రయిస్తున్న పడాల శ్రీను, కోట చిన్నరాజును అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

పూజా ద్రవ్యం.. మరింత ప్రియం

- శ్రావణ శోభతో మార్కెట్లు కిటకిట
- మహిళల పండగకు ధరల పోటు
- చుక్కలనంటిన పూజా సామగ్రి ధర
- సరిపెట్టుకుంటున్న పేద, మధ్య తరగతి కుటుంబాలు
- నేడు వరలక్ష్మీ వ్రతం



గొల్లల మామిడాడలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

బిక్కవోలు: ఏడాదికి ఓసారి శ్రావణ శుక్రవారం రోజున మహిళలు జరుపుకొనే వరలక్ష్మీ వ్రతానికి పూజా సామగ్రి ధరలు మరింత ప్రియంగా మారాయి. పేద, మధ్య తరగతి మహిళలు పెరిగిన ధరలతో బెంబేలెత్తుతున్నారు. శ్రావణ మాసంలో వర ప్రదాయిని వరలక్ష్మీదేవికి పూజలు చేస్తే తమ కోరికలు సిద్ధిస్తాయని పురాణేతిహాసాలు చెబుతున్నాయి. తమ పసుపు కుంకుమలు కాపాడాలని, ఎల్లకాలం సౌభాగ్యవతిగా జీవించాలని అమ్మవారిని కోరుతూ.. ప్రతి శుక్రవారం కుంకుమ పూజలు, సంతాన సాఫల్యం కోసం మంగళగౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో.. పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి గురువారం మార్కెట్లు మహిళలతో కిక్కిరిసిశాయి. వ్యాపారులు ఇదే అదనుగా ధరలు విపరీతంగా పెంచడంతో పేద, మధ్య తరగతి మహిళలు పూజాద్రవ్యాల కొనుగోలుకు బెంబేలెత్తుతున్నారు. అమ్మవారి పూజలో వినియోగించే యాపిల్, బత్తాయి, ద్రాక్ష, దానిమ్మ తదితర పండ్లతో పాటు, అతి ముఖ్యంగా వాడే చామంతి, తామర పూలను సామాన్యులు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలోని బిక్కవోలు, అనపర్తి, రంగంపేట, పెదపూడి మండలాల్లోని గొల్లల మామిడాడ, బిక్కవోలు, అనపర్తి, కొమరిపాలెం, పెదపూడి, వడిశలేరు తదితర గ్రామాల్లో మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. సాధారణ రోజుల్లో ధరలు, వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ప్రస్తుతం అమ్ముతున్న ధరల్లో చాలా వ్యత్యాసం ఉంది.



అనపర్తిలో అమ్మకానికి సిద్ధమైన అమ్మవారి బొమ్మలు



అత్యధిక ధర పలుకుతున్న తామర పువ్వులు

సిరులు కురిపించే శ్రావణలక్ష్మి

శ్రావణమాసంలో నోములు, వ్రతాలు, పూజల వల్ల లక్ష్మీకటాక్షం కలుగుతుంది. తదియ నుంచి మొదలు పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఆచరించాలి. తరువాత వచ్చే శుక్రవారం కూడా వ్రతం చేసుకోవడం ద్వారా కూడా మంచి ఫలితం కలుగుతుంది. శ్రావణా నక్షత్రంలో పౌర్ణమి అవుతుంది. కాబట్టి ఈ మాసాన్ని శ్రావణమాసం అంటారు. ఈ శ్రావణ నక్షత్రం విష్ణుమూర్తి జన్మ నక్షత్రం కాబట్టి ఆయకు ప్రీతికరమైనది. ఈ మాసంలో లక్ష్మీదేవి ఆరాధన చేస్తే ఆమె అనుగ్రహం పొందడంతో పాటు, విశేష ఫలితం కలుగుతుంది. ఇంకా పువ్వులు, అరటిపండ్లు, కొబ్బరికాయలు అదనంగా పెంచారు.

	సాధారణ రోజుల్లో..	ప్రస్తుతం
యాపిల్	రూ.15	రూ.30
దానిమ్మ	రూ.15	రూ.40
బత్తాయి	రూ.10	రూ.25
జామకాయ	రూ.5	రూ.10
మామిడికాయ	రూ.10	రూ.25
తామర పుష్ప	రూ.5	రూ 50
పత్రి	ఉచితం	రూ.30

ధరలు ఎక్కువగా ఉన్నాయి



ఉదయం నుంచి పెద్ద మార్కెట్‌లో పండ్ల ధరలు అధికంగా ఉన్నాయి. కేవలం నిత్య వ్యాపారం వలన ఖాతాదారులకు అందించాలని లాభం లేకపోయినా అమ్మకాలు సాగిస్తున్నాం.

– పి.కోటేశ్వరరావు, పండ్ల వ్యాపారి, పందలపాక

పండగ అంటే పెంచేస్తున్నారు



సాధారణ రోజుల కంటే పండగ రోజుల్లో తప్పనిసరిగా కొనుగోలు చేస్తున్నాం. అందుకని రేట్లు అధికంగా పెంచుతున్నారు. ఎంత ధరైనా మహిళలు తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సి వస్తుంది.

– సప్పా శాంతి, కొంకుదురు గ్రామం

కళ తప్పిన వ్రతం షాపింగ్



అనపర్తిలో కొరవడిన కొనుగోలుదారుల సందడి

అనపర్తి: మహిళలు భక్తిశ్రద్ధలతో చేసే వరలక్ష్మీ వ్రతం షాపింగ్ అనపర్తిలో కళతప్పింది. ఎప్పుడూ భారీ జన సందోహంతో కళకళలాడే అనపర్తి మెయిన్‌రోడ్ గురువారం అంతంతమాత్రంగానే కొనుగోలుదారులు రావడంతో వెలవెలబోయింది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం ఓ కారణమైతే, పూజా ద్రవ్యాల ధరలు ఆకాశన్నంటడం మరో కారణంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వం ఏదో రూపంలో ప్రజల ఖాతాల్లోకి క్రమం తప్పకుండా డబ్బులు వేసేదని, దాంతో ప్రజలు ధరను కూడా పట్టించుకోకుండా కొనుగోళ్లు చేసేవారని మహిళలు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని వ్యాపారులు చెబుతున్నారు. గతేడాది కాలంగా సరైన ఆదాయాలు లేక, అంతంతమాత్రంగానే పండగలు చేసుకుంటున్నారు. పువ్వులు, పండ్లు నాలుగు కొనే చోట.. ఒక దానితో సరిపెట్టుకోవాల్సి వస్తుందని మహిళలు వాపోయారు.

వైఎస్సార్ సీపీ కాపవరం అధ్యక్షుడిగా కొట్టు



కాపవరం గ్రామ సమన్వయ కమిటీని అభినందిస్తున్న డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ బిక్కవోలు మండలం కాపవరం గ్రామ సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా కొట్టు వీరవెంకట్రావును పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం ప్రకటించారు. నూతన కమిటీలో సభ్యులుగా సత్యంశెట్టి గోవిందరాజు, గంగులూరి సూరిబాబు, పోసిన వరప్రసాద్, సురేష్ దొర, బత్తిన సూరిబాబు, పిండి వెంకటేశ్వర్లు(నాని), ఆచంట సతీష్, తలారి కాంతారావు, కుంతం వెంకట్రావు, కచ్చా ఆనంద్ ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, బిక్కవోలు మండల కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి(బుజ్జి), సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, కాపవరం ఎంపీటీసీ మారెళ్ల భీష్ముడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కబుర్లతో కాలం గడిపేస్తున్నారు

- వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- సాగు నీటి కోసం నిరాహార దీక్ష చేపట్టిన రైతులు



సీతారామపురంలో నిరాహార దీక్ష చేస్తున్న రైతులు

రాజానగరం: రైతు బిడ్డనంటూ పదే పదే చెప్పుకొనే స్థానిక ఎమ్మెల్యేకి సాగు నీరు సక్రమంగా అందక నియోజకవర్గంలో రైతులు పడుతున్న పాట్లు కనిపించడం లేనట్టుగా ఉందని వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఎద్దేవా చేశారు. కలవచర్ల పుష్కర లిఫ్టులో మూడు మోటార్లకు బదులుగా ఒక్క మోటారు మాత్రమే పనిచేస్తున్న తరుణంలో సాగు నీటికి ఇబ్బంది పడుతున్న రైతులు మండలంలోని సీతారామపురంలో గురువారం సాగు నీటి కోసం ధర్మ పోరాట దీక్ష పేరుతో చేపట్టిన ఆందోళనకు ఆమె సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే మాటలు కోటలు దాటుతుంటే, చేతలు మాత్రం నేలను దాటడం లేదన్నారు. ఖరీఫ్ వరి పంటకు ముందుగానే సాగు నీటిని అందిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకున్న ఎమ్మెల్యే.. ఈ రైతులకు ఏమని సమాధానం చెప్తారని ప్రశ్నించారు. పనిచేయని రెండు మోటార్లను తక్షణమే మరమ్మతులు చేయించి, పూర్తి స్థాయిలో సాగు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అప్పులు చేసి మరీ సాగుకు సిద్ధమైన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. సకాలంలో సాగు నీరు అందకుంటే పంటలు పూర్తిగా ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సాగు నీటికి ఎటువంటి సమస్య ఎదురుకాకుండా పూర్తి స్థాయిలో అందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వారం రోజుల్లోగా నీటిని అందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం దీక్ష చేస్తున్న వారికి సాయంత్రం నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. వైఎస్సార్ సీపీ ప్రతినిధి మేడా గురుదత్త ప్రసాద్ కూడా సంఘీభావం తెలిపారు. దీక్షలో సర్పంచ్ బొబ్బరాడ వరహాలు, ఉప సర్పంచ్ సూరపురెడ్డి గొల్లబ్బాయి, ఎంపీటీసీ సభ్యుడు నాగమళ్ల పండు, నాయకులు అడబాల చిన బాబు, సత్యనారాయణ, తోరాటి శ్రీను, తుమ్మల గంగరాజు, కోలా అబ్బులు, మందాల దత్తుడు, మందాల బాబ్జి, ఆదం ఫకీర్, అడబాల సోమేశ్వరరావు, భద్రం, అమరపల్లి రమణ, పెదకాపు, బాపిరాజు, రాముడు, చంద్రు సూర్యారావు, మేడిశెట్టి రాజు, వనుం గంగాధర్, అశోక్, సేనాపతి గణేష్, నాగబాబు, బత్తిన రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై వాచ్‌డాగ్ కమిటీ ఏర్పాటు



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: ఆక్రమణకు గురైన ఇరిగేషన్ కాలువ గట్లు, ట్యాంక్ బండ్ల పరిశీలన, పర్యవేక్షణకు మండలంలో నూతనంగా వాచ్‌డాగ్ కమిటీ ఏర్పాటు చేశామని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం సచివాలయ కార్యదర్శులు, సర్వేయర్లతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, వాచ్ డాగ్ కమిటీ చైర్మన్‌గా తహసీల్దార్, వైస్ చైర్మన్‌గా తాను, ఇతర అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు. కొంతమంది ట్యాంక్ బండ్లు, ఇరిగేషన్ కాలువ గట్ల ఆక్రమణపై హైకోర్టులో పిల్ వేశారన్నారు. కోర్టు ఆదేశాలపై ప్రభుత్వం కొన్ని చర్యలు తక్షణమే ఉపక్రమించాలని, వాచ్‌డాగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచిందన్నారు. దానిపై వీఆర్వోలు, గ్రామ సచివాలయ కార్యదర్శులు, ఇరిగేషన్ అధికారులు ఈ నెల 11న రామేశ్వరం గ్రామం నుంచి పుట్టకొండ గ్రామం వరకు, 12వ తేదీన జి.మామిడాడ నుంచి చింతపల్లి వరకు అన్ని చెరువులు, ఇరిగేషన్ కాలువలు, ప్రభుత్వ బోదెలను ఆక్రమించుకున్న ప్రదేశాలు పరిశీలించాలన్నారు. అలాగే ఆక్రమణదారుల జాబితాను వెంటనే ఆయా గ్రామాల సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు, సర్వేయర్ల సహకారంతో తయారు చేసి వాచ్ డాగ్ కమిటీ చైర్మన్‌కి 12వ తేదీ సాయంత్రానికి ఎల్‌పిఎం నంబర్లతో సహా అందజేయాలన్నారు.

ప్రజాస్వామ్యంపై నమ్మకం లేకే ఎమ్మెల్సీ రమేష్‌పై దాడి

బీసీ సెల్ అనపర్తి అధ్యక్షుడు భీమేశ్వరస్వామి



అనపర్తిలో నిరసన తెలుపుతున్న బీసీ నాయకులు

అనపర్తి: కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేకే ప్రతి ఒక్కరిపై భౌతిక దాడులకు, ఆస్తుల విధ్వంసానికి తెగబడుతున్నారని బీసీ సెల్ అనపర్తి అధ్యక్షుడు కొండేటి భీమేశ్వరస్వామి ఆక్షేపించారు. కడప జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గూండాల హత్యాయత్నాన్ని ఖండిస్తూ అనపర్తి పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భీమేశ్వరస్వామి మాట్లాడుతూ, కేవలం ఓ జెడ్పీటీసీ స్థానంలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరగనీయకుండా బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడికి పాల్పడడం ప్రభుత్వ దైన్య స్థితికి అద్దం పడుతోందన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు రాజమండ్రి చేరుకుని, అక్కడ పూలే విగ్రహం వద్ద జిల్లా స్థాయి బీసీ నేతల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్, పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, బీసీ సెల్ జిల్లా నాయకులు వాసంశెట్టి మాధవ్, గంగ్రేడు సర్పంచ్ డోకుబుర్ర మీనాక్షికృష్ణ, ఎంపీటీసీ సమ్మంగి దుర్గాప్రసాద్, బండారు శ్రీనివాసరావు, మార్ని వెంకట్రావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, అంసూరి మల్లేశ్వరరావు, బొక్క సాంబమూర్తి, చిట్టూరి సత్తిబాబు, కాకర, తిరగాటి సాయి, మెంతుల రాజు తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



కొండపల్లి దుర్గారావు

సీతానగరం: వైఎస్సార్ సీపీ నేత, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు గురువారం డిమాండ్ చేశారు. ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీలందరూ ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలోని బీసీలందరి మనోభావాలు దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

నాలుగు లేన్ల రోడ్డు కోసం ధర్నా

- వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆందోళన
- రెండు కిలోమీటర్లు స్తంభించిన ట్రాఫిక్



రఘుదేవపురంలో ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

సీతానగరం: రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు నాలుగు లేన్ల స్థానే 30 అడుగుల రోడ్డు నిర్మించే చర్యలకు నిరసనగా వైఎస్సార్ సీపీ శ్రేణులు గురువారం కదం తొక్కారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా కాతేరు–సీతానగరం నాలుగు లేన్ల రోడ్డు రఘుదేవపురం వరకు పూర్తి కాగా, అక్కడి నుంచి సీతానగరం వరకు 30 అడుగుల రోడ్డు నిర్మించే ప్రయత్నాలను అడ్డుకుంటామని పార్టీ నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. రఘుదేవపురం శివారున నాలుగు లేన్ల రోడ్డు వద్ద గ్రామస్తులతో కలిసి గురువారం ధర్నా నిర్వహించారు. దీంతో రెండు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించింది. రూ.70 కోట్లతో నాలుగు లేన్ల రోడ్డు రఘుదేవపురం శివారు వరకు పూర్తి కాగా, ఎన్నికల కోడ్ రావడంతో అక్కడి నుంచి సీతానగరం వరకు ఆర్అండ్‌బీ రోడ్డు పనులు నిలిచి పోయాయి. కూటమి ప్రభుత్వం ఇప్పుడు రఘుదేవపురం–సీతానగరం రోడ్డు 30 అడుగులకు పరిమితం చేయడానికి సిద్ధమైంది. దీనిని వ్యతిరేకిస్తూ, మిగిలిన రెండు కిలోమీటర్లూ నాలుగు లేన్లుగా వేయాలన్న డిమాండ్‌తో ఆందోళన చేపట్టారు.

30 అడుగుల రోడ్డును అడ్డుకుంటాం

రఘుదేవపురం–సీతానగరం 30 అడుగుల రోడ్డు పనులు అడ్డుకుంటామని మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు హెచ్చరించారు. రఘుదేవపురం శివారు వరకు వేసిన నాలుగు లేన్ల రోడ్డును సీతానగరం వరకూ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రలోభాలకు లొంగి, ఎవరితోనో కుమ్మక్కై 30 అడుగుల రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. నాలుగు నెలల నుంచి సత్యసాయి వాటర్ రావడం లేదని, రాజానగరంలో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, కూటమి ప్రభుత్వానికి ఇది సిగ్గు చేటన్నారు. పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్ మాట్లాడుతూ, 90 శాతం రోడ్డు పనులు పూర్తి కాగా, రెండు కిలోమీటర్ల రోడ్డును వేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. మంజూరైన నాలుగు లేన్ల రోడ్డును ఎమ్మెల్యే వేయించలేని దుస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షులు కోండ్రపు ముత్యాలు మాట్లాడుతూ, ఏడాది నుంచి రఘుదేవపురం–సీతానగరం రోడ్డు గోతుల్లో పడి అనేక మంది క్షతగాత్రులయ్యారన్నారు. నాలుగు లేన్ల రోడ్డును 30 అడుగులకు ఎందుకు కుదించారని, ఎవరెవరిది ఎంతెంత వాటా అని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న నిలదీశారు. రఘుదేవపురం నుంచి రాజమహేంద్రవరానికి నాలుగు లేన్ల రోడ్డుపై ప్రయాణిస్తున్నామంటే మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చలవేనని కొనియాడారు. పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు, ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పోలినాటి ఈశ్వరుడు, యువజన విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ చేకూరి వీఎస్ రామకృష్ణంరాజు(నాని) తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, పార్టీ నాయకులు పిండి రాధాకృష్ణ, పైడి రాజు, సర్పంచ్ చెరుకూరి శ్రీను, ద్వారంపూడి రామకృష్ణ, ఈత వీరబాబు, మట్ట శ్రీను, పిచ్చుకల విజయ్‌కుమార్, చిర్ల పోశియ్య, ఇంద్ర, యర్రంశెట్టి బాబు తదితరులు పాల్గొన్నారు. స్తంభించిన ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై కేసు

సీతానగరం: రఘుదేవపురంలో నాలుగు లేన్ల రోడ్డు కోసం ధర్నా నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ గురువారం తెలిపారు. మండలంలో పోలీస్ యాక్ట్–30 అమలులో ఉండగా, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించి, ధర్నా చేసిన నాయకులపై కేసు నమోదు చేశామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్‌బాబు), అదికారి శ్రీను, పెందుర్తి దేవదాసు, అంబటి రాజు, అంబటి రమణ, నాగరాజు, పరిమి రాధాకృష్ణ, పిచ్చుకల విజయ్‌కుమార్, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, కోండ్రపు ముత్యాలు, ఎంపీటీసీ శ్రీను, చిడిపి బంగారయ్య, మరి కొందరిపై కేసు నమోదు చేశామన్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



శహపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



పందలపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెదపూడి: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు అమృతమని, ప్రతి తల్లి తమ బిడ్డలకు తల్లిపాలు అందించాలని ఐసీడీఎస్ సంపర సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీపద్మావతి అన్నారు. శహపురం గ్రామంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ జరిగింది. ఆమె మాట్లాడుతూ, గర్భిణులు పుట్టిన శిశువుకి గంటలోపు తల్లిపాలను పట్టించాలన్నారు. తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వనుం శాంతకుమారి, సచివాలయ కార్యదర్శి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం

బిక్కవోలు: ముర్రుపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ ఊలపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ శాంతి రత్నకుమారి అన్నారు. పందలపాక గ్రామంలో జరిగిన తల్లి పాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ, చిన్నారులకు ఐదేళ్ల పాటు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. తల్లిపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు, శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లి కూడా ఆరోగ్యకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ర్యాలీ చేశారు. సర్పంచ్ సబ్బారపు పద్మావతి, ఉప సర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి, వార్డు సభ్యులు యామాల చిన్నమ్మ, మల్లిరెడ్డి వీరదుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సూరిశెట్టి సురేష్, అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లులకు అవగాహన

సీతానగరం: ముగ్గళ్ల అంగన్‌వాడీ సెంటర్–1లో తల్లిపాల వారోత్సవాలు గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్ పి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో తల్లులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ముర్రి పాలతో బిడ్డకు మంచి తెలివితేటలు వస్తాయని, తల్లికి పలు రకాల వ్యాధులు రావని వివరించారు. అనంతరం పోషణ్ కిట్లలను అందించారు.